

# హాస్య వల్లరి



## నెలనెలా నవ్వుల పండుగ

కామెడీ క్లబ్ కథలు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

### వెడ్డింగ్ యానివర్సిరీ

**తమ 50వ వెడ్డింగ్ యానివర్సిరీ రోజున** ఆచారి, అతని భార్య తాము తొలిసారిగా కలుసుకున్న హైస్కూలులోని తమ క్లాసురూముకి వెళ్ళారు. అక్కడ డెస్క్ మీద "ఐ లవ్ యూ రుక్మిణీ" అని ఆచారి ఆ రోజుల్లో చెక్క బల్ల మీద చెక్కిన అక్షరాలని తన భార్యకి చూపించాడు. విషయం తెలిసి స్కూలు టీచర్ వాళ్ళ పేర్లు పిలిస్తే సరదాగా 'ప్రెజెంట్ టీచర్' అని కూడా అన్నారిద్దరూ.

సరే.. అదయ్యాక ఇంటికి తిరిగి వస్తుంటే, ఓ బేంక్ వేన్ లోంచి వాళ్ళ కాళ్ళ దగ్గర ఒక మూట పడింది. చూస్తే అందులో పది లక్షల రూపాయలున్నాయి.

"ఆ బేంక్ పేరు వేన్ మీద రాసుంది. తీసుకెళ్ళి ఇచ్చేద్దాం" చెప్పాడు ఆచారి.



ఒద్దు అని రుక్మిణి దాన్ని తీసుకెళ్ళి తమింట్లో సింక్‌లో దాచింది.

మర్నాడు పోలీసులు ఒకో ఇంటికి వెళ్ళి దారిలో పడిపోయిన ఆ బేంక్ డబ్బు గురించి ఆరా తీయసాగారు. రుక్మిణి, ఆచారుల ఇంటికి కూడా వచ్చి అడిగారు.

"నిన్న బేంక్ వేన్ లోంచి డబ్బుల మూట పడిపోయింది. మీరు కాని చూశారా?"

"లేదు" చెప్పింది రుక్మిణి

"మా ఆవిడ అబద్ధం ఆడుతోంది. వద్దంటున్నా వినకుండా ఆ డబ్బుల మూటని ఇంటికి తెచ్చింది" నిజం చెప్పాడు ఆచారి.

"మా ఆయనకి స్క్రూ లూజు" వెంటనే చెప్పింది రుక్మిణి.

పోలీసులు ఆచారిని ఆసక్తిగా అడిగారు

"అసలు నిన్నేం జరిగిందో వివరంగా చెప్పు"

"నిన్న మా పెళ్ళిరోజు. దాంతో స్కూలు కెళ్ళి అటెండెన్స్ చెప్పి తిరిగి వస్తుంటే దారిలో డబ్బుల మూటా కనిపించింది. దాన్ని తెచ్చి మా ఆవిడ సింక్‌లో దాచింది.."

ఆచారి వంక ఓ పిచ్చివాడ్ని చూసినట్లుగా చూసి ఆ పోలీసులిద్దరూ బయటికి నడిచారు. ***

## ఉద్యోగం-ఉల్లాసం..!

యర్రంశెట్టి శాయి



**సెక్రటరీ:** ఉద్యోగం ఒకతను వచ్చి కూర్చున్నాడండీ. లోపలకు పంపించమంటారా?

ఆఫీసరు: ఎలా వున్నాడతను?

సెక్రటరీ: పొడుగ్గా నల్లగా వున్నాడు. ఒకటే చేయి ఉంది.

ఆఫీసరు: అంతకు ముందు ఏం ఉద్యోగం చేసేవాడట?

సెక్రటరీ: సర్కస్ కంపెనీలో ఒకే ఒక్క ఫీట్ చేసేవాడట!

ఆఫీసరు: ఏమిటది?

సెక్రటరీ: సింహం నోట్లో చెయి పెట్టడం!

***

**అమోఘరావ్‌ని** వాళ్ళ ఆఫీసరు పిలిచాడు.

"మిస్టర్ అమోఘరావ్. చనిపోయినవాళ్ళు తిరిగి పుడతారంటావా?" అడిగాడు ఆఫీసరు.

"అవున్సార్ పుడతారు" ఆ ప్రశ్న ఎందుకడిగాడా అని ఆలోచిస్తూ జవాబిచ్చాడు అమోఘరావ్.

"అలాగా! అయితే సరే. మరేం లేదు. నిన్న మీ తాత అంత్యక్రియలకోసమని నువ్వు శెలవు పెట్టి వెళ్ళిపోయాక, నీ కోసం మీ తాత ఆఫీసుకొచ్చాడు.."

***

**రాంబాబు** ఉద్యోగాల వేటలో ఉన్నాడు. అతి కష్టం మీద ఓ ఉద్యోగం తాలూకు వ్రాత పరీక్షలో నెగ్గి ఇంటర్వ్యూ కొచ్చాడు. ఇంటర్వ్యూలో చాలా మందికి ఏదో ఒక పిచ్చి ప్రశ్న అడిగి తికమకపెట్టి ఫెయిల్ చేస్తారని అతనికి చాలామంది వార్నింగిచ్చేరు. భయంతోనే ఇంటర్వ్యూ హాల్లోకి అడుగు పెట్టేడతను.

"చూడు మిస్టర్! ఓ చిన్న ప్రశ్న వేస్తాను. బాగా ఆలోచించి సమాధానం చెప్పు. ఒక వ్యక్తి ఒక వస్తువుని ఎనిమిది రూపాయల ముప్పయి పైసలకు కొని, వెంటనే దాన్ని ఆరురూపాయల అరవై పైసలకు అమ్మేశాడు. అతనికి లాభమా , నష్టమా?

రాంబాబు తెగ ఆలోచించి అన్నాడు.

"రూపాయల్లో నష్టం. పైసల్లో లాభం సార్.."

***

**కొన్నేళ్ళపాటు** ఉద్యోగం అల్లాడిపోయిన గణపతి రావుకి చివరకు అతి ఖరీదైన వస్తువులమ్మే షాపులో ఉద్యోగం దొరికింది. చేరిన మొదటి రోజునే అతను ఎంతో ఖరీదైన గాజు సామాను సెట్టు పగలగొట్టాడు. అందమైన తివాచీ మీద 'టీ' వొలికి మరకలు పడిపోయింది.

చాలా విలువగల పెయింటింగ్ పొరబాటున అతని చేతిలోనే విరిగి పోయింది.

"వీటన్నిటి ఖరీదూ నువ్వే కట్టుకోవాలి. ప్రతి నెలా నీ జీతంలో సగం తెగ్గోస్తాను" అన్నాడు షాపు యజమాని కోపంగా.

"అన్నీ కలిపి ఎంత కట్టుకోవాలి?" అడిగాడు గణపతి రావు అమాయకంగా.

"అయిదువేల రూపాయలు" అన్నాడు షాపు యజమాని కసిగా.

"అహ్హా..లలల్లా..దేముడు కరుణించెన్. నా జన్మధన్యమయ్యెన్.." అంటూ ఆనందంగా పాట పాడాడు గణపతి రావు.

"అయితే అయిదువేల రూపాయలు కట్టడమంటే నీ కింత సంతోషంగా వుందన్నమాట" అన్నాడు షాపు యజమాని కోపంగా.

"అవున్సార్..ఇప్పట్లో నా ఉద్యోగం ఊడిపోయే ప్రమాదం లేదుగా మరి..!"

***



పర్సనల్ ఆఫీసర్ పద్మనాభం తన ఎదురుగ్గా నిలబడ్డ అప్పారావ్ వంక చిరాకుగా చూశాడు.

"అయితే నీకీ ఆఫీస్‌లో ఉద్యోగం కావాలంటావ్?"

"అవునండీ!"

"నువ్వేం పని చెయ్యగలవ్?"

అప్పారావు బుర్రగోక్కున్నాడు. "నిజం చెప్పాలంటే నేనే పనీ చెయ్యలేనండీ.."

"ఓహో..అదన్నమాట సంగతి. మరలాంటప్పుడు నాలుగు నెలల క్రిందటే అప్లయి చేసి ఉండాల్సింది.ఆ ఎక్కువ జీతాలు గల ఉద్యోగాలన్నీ అప్పుడే భర్తీ అయిపోయాయి.."

***

సీతాపతి ఓ కాగితం పట్టుకుని ఆఫీసర్ గదిలోకి జొరబడ్డాడు.

"సార్. ఆర్నెల్ల క్రితం మీరు ఓ గుమాస్తాని డిస్మిస్ చేసేశారు చూడండి. అతనిని తమ కంపెనీలో చేర్చుకోబోతోందనీ, కనుక అతని గురించి మీ అభిప్రాయం తెలుపవలసిందనీ ఆ కంపెనీ వాళ్ళు రాశారు.."

"వాడి గురించా?" మండి పడుతూ అన్నాడు ఆఫీసరు.

"వాడికి తెలిసిన విద్యలు లంచం, దొంగతనం. వాడి బుద్ధి. కపట బుద్ధి. ఇదే రాయ్ వాళ్ళకు. అన్నట్లు యింకో విషయం కూడా రాసెయ్! వాడు పెద్ద చవటనీ. వాడికి వచ్చిన విద్యలన్నీ మనమే నేర్పించామనీ కూడా స్పష్టం చెయ్.."

***

## చౌ చౌ

జంబులింగం పోలీస్ స్టేషన్ కి ఫోన్ చేశాడు.

"ఏమండీ..ఎవరో మా పెరట్లో బాంబు వదిలేసి వెళ్ళారు.." అన్నాడు.

అవతలనుంచీ పోలీసు " ఏం ఫరవాలేదు, ఓ మూడు రోజులు చూడు.." అన్నాడు.

"తరువాత.."

"ఎవరూ రాకపోతే నువ్వే ఉంచుకో.."

***

పక్కింటాయన తలుపు తడుతుంటే తీశాడు జంబులింగం.

"జంబులింగం గారూ.. దొంగా పోలీస్ ఆటాడుకుందాం వస్తారా?" పక్కింటాయన ఉత్సాహంగా అడిగాడు.

"ఎవరెవరు ఆడుతున్నా రేమిటి?" జంబులింగం ఆసక్తిగా అడిగాడు.

"మీరు, నేను , మీ ఆవిడ.." పక్కింటాయన సమాధానం.

" నాకిష్టం లేదు.." జంబులింగం మూతి ముడుచుకున్నాడు.

"అయితే మీ దోస్త్ కటీఫ్..మేమిద్దరమే ఆడుకుంటాం"



***

"పెళ్ళికి ముందు నువ్వు ఏం చేస్తుండే వాడివి?"

"నేను చెయ్యాలనుకున్న పనులన్నీ చేసుకునే వాడ్ని"

"మరి ఇప్పుడో..?"

"పనులైతే చేస్తున్నాను కానీ, నేననుకున్నవి కాదు, మా ఆవిడ చెప్పేవి.."

***

**స్నేహితుడి** పెళ్ళి రెసెప్షన్ కి వెళ్ళిన జంబులింగం ప్లేటు తర్వాత ప్లేటు మారుస్తూ..భోజనం లాగిస్తూనే ఉన్నాడు. చాలా సేపు గమనించిన ఇంకో ఫ్రెండు " చాల్లేరా జంబులింగం..ఇంకా ఎంత సేపు తింటావ్..?" మందలింపుగా అన్నాడు.

" నాకూ ఇంతసేపు తినడం ఇబ్బంది గానే ఉంది కానీ ఏం చెయ్యమంటావ్? డిన్నర్ 7 గంటల నుంచీ 10 గంటల దాకా అని వుంది.." అసలు విషయం చెప్పాడు జంబులింగం.

***

**"మీ నాన్న** నా కాళ్ళు కడిగి కన్యాదానం చేస్తున్నప్పటి ఫోటోలో నా మొహం దివ్యంగా ఉంది కదూ.." కాలర్ ఎగరేస్తూ గర్వంగా అన్నాడు జంబులింగం.

" ఏమో గానీ, నాకు మాత్రం ఆ సమయంలో మా నాన్న వసుదేవుడిలా కనిపించారు.." కసిగా చెప్పింది మిసెస్ జంబులింగం..!

***

**తగలబడిపోతున్న** భవనంలోనుంచి ఆరుగురుని బలవంతంగా బయటికి లాక్కొచ్చాడు జంబులింగం.

అందుకని పోలీసులు అతన్ని జైల్లో పెట్టారు.

ఎందుకంటే అలా అతను బయటికి లాక్కొచ్చిన వాళ్ళు అగ్ని మాపక దళానికి సంబంధించిన వాళ్ళు మరి..!

***

**" ఏమండీ..**ఈ బస్సులో అక్కడినుంచీ ఈ చివరి స్టాప్ దాకా వచ్చారు. కిందికి దిగకుండా మళ్ళీ వెనక్కి టిక్కెట్ అడుగుతున్నారేమిటీ.."

"మరేం చెయ్యమంటావయ్యా..నేనెక్కాల్సిన 22 బస్సు రాలేదు.అందుకని ఈ 11 నంబరు బస్సులో రెండు సార్లు ప్రయాణిస్తున్నా.."

***